# రాలిరేకు

చిన్నతనంలో చూసిన కొన్ని దృశ్యాలూ, కలిగిన అనుభవాలూ పసి హృదయాలమీద స్పష్టమైన ముద్ర వేస్తాయి. విశాఖపట్నంలో మొట్టమొదట చూసిన సముద్రం ఎంత ఆశ్చర్యం కలిగించిందో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్ళికూడా అంత ఆనందం కలిగించింది అయిదేళ్ళ అనంతానికి.

పార్వతమ్మ తన బంధువుల ఇంట జరిగిన పెళ్ళికి అనంతాన్ని కూడా తీసుకువెళ్ళింది. అంకురార్పణ, స్నాతకం, గౌరీ తపస్సు, నాగవల్లి అంటూ ఏదో హడావిడిగా పట్టుచీరల రెపరెపలతో ఆడవాళ్ళు తిరుగుతూ ఉంటే అవి ఏమిటో తన పసిహృదయానికి అర్థం కాకపోయినా తనతో ఆడుకుందుకు, తన ఈడు పిల్లలు కావలసినంత మంది ఉన్నారు. రోజూ దిపాలు నిండిన పందిళ్ళలో హరికథలూ, గానకచ్చేరీలు జరుగుతూ ఉంటే మిఠాయిలు తింటూ పెద్దవాళ్ళ పక్కన కూర్చుని ఏదో వింత ప్రపంచంలో ఉన్నట్లు గడిపాడు అనంతం.

"అటు వెళ్ళవద్దు, ఇటు రాకూడదు, అల్లరి చెయ్యకూడదు" అని ఆంక్షలు లేవు. అందరూ తనను పలకరించేవాళ్ళే, తన మాటలు విని ముద్దులాడేవాళ్ళే.

ఇంటికి తిరిగి వచ్చాక తన తల్లి పక్క ఇంటివాళ్ళతో పెళ్ళి

విశేషాలు చెప్తూవుంటే, చీర కొంగు పట్టుకొని వింటున్నాడు అనంతం. "ఒకటి కాదు, రెండుకాదు, అయిదు రోజుల పెళ్ళి- పదివేల కట్నం ఇచ్చి చేశారు. చాలా ఘనంగా జరిపారనుకోండి" అని కళ్లు పెద్దవి చేసి చెప్తోంది పార్వతమ్మ. "అమ్మా నాకూ కట్నం ఇస్తావా" అని అడిగాడు అమాయకంగా, ఆ పదానికి అర్థం తెలియకపోయినా. పార్వతమ్మ ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటూ "మనం కట్నం ఇవ్వడమేమిటి? నువ్వు బాగా చదువుకుని ఉద్యోగస్థుడవైతే కావలసినంత కట్నం ఇచ్చి పిల్ల నిస్తారు" అని నవ్వింది. ఆ మాట విని గుర్రం ఎక్కినంత సంబర పడ్డాడు అనంతం. అదే మొదటిసారి తను కట్నం అన్న పదం వినడం.

అక్క కామేశ్వరి పెళ్ళి జరిగిన నాటికి అనంతం వయసు పదకొండేళ్ళు. కానీ, తన పసితనంలో చూసిన పెళ్ళిలా కనిపించలేదు. వాస్తవ జీవితంలోకి అడుగు పెడుతూ లోకాన్ని మెల్ల మెల్లగా అర్థం చేసుకుంటున్న అనంతానికి ఈ పెళ్ళి వేరే విధంగా తోచింది. తల్లీ తండ్రీ ఏదో పెద్ద బరువు నెత్తిమీద ఉన్నట్లు గంభీరంగా ముఖం పెట్టుకుని సతమతమై పోతున్నారు. మరీ చిన్నతనంలో లాగా ప్రశ్నలు వెయ్యకపోయినా, రెండు వేలు కట్నం ఇవ్వడానికి ఒప్పుకుని ఒక వెయ్యి చెల్లించి, ఇంకో వెయ్యి వెనకపెట్టి త్వరలో ఇవ్వడానికి మగ పెళ్ళి వారిని ఒప్పించినట్లు తెలుసుకున్నాడు అనంతం. "ఇంత కట్నం ఇచ్చి ఈ సంబంధం చేసుకోకపోతే ఏం? ఇప్పటికీ అబ్బాయికి గవర్నమెంటు ఉద్యోగం లేదట. ఏదో ప్రైవేటు కంపెనీ ఉద్యోగం అంటున్నారు" అని విసుగ్గా ఎవరితోనో చెప్తోంది పార్వతమ్మ. పదివేలు కట్నం ఇచ్చి తన బంధువుల ఇంట్లో ఘనంగా పెళ్ళి జరిపారని తన చిన్నతనంలో గొప్పగా చెప్పిన అమ్మ, రెండువేల కట్నం ఎక్కువ అని విసుక్కోవడం ఏమిటో అర్థం కాలేదు అనంతానికి. ఈ కట్నం అన్న

పదం మాత్రం అతని మనసులో చిన్న చిక్కు ప్రశ్న అయి, కొంత అర్థమై, కొంత అర్థంకాక కూర్చుంది.

అడుగడుగునా మగపెళ్ళివారు ఏదో సణగడం, మూతివిరవడం, కామేశ్వరికి కాబోయే అత్తగారూ, ఆడపడుచూ ఏదో అలగడం, అమ్మ కాళ్ళా వేళ్ళా పడి బతిమాలి అలక తీర్చడం చూస్తూ ఉండే మూడు రోజుల పెళ్ళి కూడా చాలా ఖర్చుతో కూడిన పెద్ద వ్యవహారం అనిపించింది. చిన్నతనంలో పెళ్ళిఅంటే తన కున్న తియ్యని అభిప్రాయం మారింది. అక్క ఉన్నంత సేపూ ఒంటరితనం బాధించలేదు. ఎక్కాలు అప్పచెప్పించుకుంటూ, పాఠాలూ, కథలూ చెప్పే అక్క అత్తవారింటికి వెళ్ళిపోగానే ఏదో వెలితి అనిపించింది. స్కూలులో తోటి పిల్లలతో ఆడుకుంటున్నంత సేపూ తోచకపోవడం అన్న ప్రశ్న ఉదయించక పోయినా ఇంటికి రాగానే ఒంటరితనం బాధించేది. అమ్మ ఉత్సాహంగా ఉండటం లేదు, తెలిసీ తెలియని ప్రశ్నలు వేసినప్పుడు "నీకెందుకూ పోయి చదువుకో" అని కసిరితే తన పాఠాలలో, హోమ్‌వర్కులో తల దూర్చి సర్దుకుపోయేవాడు అనంతం.

ఒక్క విషయం మాత్రం తన చిన్న మనసు గ్రహించ గలిగింది. అక్క పెళ్ళి అయిన నాటి నుంచీ అమ్మా, నాన్నా సరదాగా మాట్లాడుకోవడం చూడలేదు. అప్పుడప్పుడు అక్క ఉత్తరం రాయడం, ఉత్తరం రాగానే ఇద్దరూ ఒకరి నొకరు దూషించుకోవడం, అమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకొని "ఎలాగో ఓలాగు, వెయ్యి రూపాయలు సర్ది ఇచ్చేస్తే నా పిల్ల ఇలా నానా మాటలూ పడేది కాదు. కట్నం వెనక పెట్టవద్దు అంటే నామాట విన్నారు కాదు" అని నాన్నగారిని తప్పు పట్టడం చూస్తూ ఉండేవాడు అనంతం. కిరాణా కొట్టువాడు పాత బాకీ తీర్చనిదే అరువు ఇవ్వనని గట్టిగా చెప్పి వెళ్ళిపోయాడు.

కట్నంబాకీ తీర్చకపోతే మర్యాదగా ఉండదని కామేశ్వరి అత్త

అనంతం నాన్నగారికి పెద్ద ఉత్తరం రాయడం, దానికి జవాబుగా ఆయన "కొద్ది వ్యవధిలో తీర్చేస్తాము, చిన్న పిల్లను మాటలతో బాధించడం న్యాయం కాద"ని అనునయిస్తూ, అప్పుడప్పుడు సహనం తగ్గి నిందిస్తూ రాయడం కొన్ని సంవత్సరాలపాటు జరిగింది. ఈలోగా ఈ సమస్యను కాలమే పరిష్కరించింది. అటు కామేశ్వరి అత్తగారూ, ఇటు కామేశ్వరి తండ్రీ ఆరు నెలల తేడాతో జీవితరంగంనుంచి నిష్క్రమించారు. కానీ, ఈమధ్యలో అక్కపడిన అగచాట్లు అనంతం మనసు మీద గాఢమైన ముద్ర వేశాయి.

ఇంటర్మీడియట్ చదువుకుంటున్న అనంతం అంటే ఎకనామిక్స్ లెక్చరర్ సూర్యనారాయణ గారికి చాలా అభిమానం. అగ్గిపెట్టె నుంచి అణుశక్తి దాకా ఎన్నో విషయాలూ, సామాజిక న్యాయం, అంటూ ఏవేవో ఇద్దరూ చర్చించుకునేవారు. అనంతం సందేహాలు అడగడం, సూర్యనారాయణగారు ఉత్సాహంతో ఆ సందేహాలు దీర్చడం చూడ ముచ్చటగా ఉండేది. అనంతానికి ఉన్న ఒకే ఒక అక్క కామేశ్వరి. ఒకే అన్న శేఖరం. అక్క దగ్గిర ఉన్న చనువు అన్న దగ్గిర లేదు అనంతానికి. మొదటి కారణం- వాళ్ళిద్దరి మధ్యా ఉన్న పదిహేనేళ్ళ వ్యత్యాసం. అనంతానికి బాగా జ్ఞాపకం లేని మూడు, నాలుగేళ్ళ బాల్యంలోనే శేఖరం ఊరు విడిచి హౌరా వెళ్ళిపోవడం, అక్కడ స్థిరపడ్డ ఒక తెలుగు కుటుంబంలోని పిల్లను చేసుకుని, ఇల్లరికం ఉండిపోవడం రెండవ కారణం. ఎప్పుడైనా వాళ్ళు ఏదైనా సందర్భాలలో కలిసినా 'వదిన బెట్టుగా ఉంటుంది చనువుగా ఉండదు' అనుకునేవాడు అనంతం. ఆ భావన అనంతానికే కాదు, అత్తగారైన పార్వతమ్మకీ కలిగేది. కోడలు అభిమానించి 'అత్తగారూ' అని నోరారా పిలవదని బాధపడేది. నాన్నగారు అన్న దగ్గరగా నిలిచి మాట్లాడుకోవడమే చూడలేదు. నాన్నగారు పోయినప్పుడు వచ్చి వెళ్ళిన అన్నగారి నుంచి ఉత్తరం రావడమే చాలా అరుదైపోయింది.

'ఇల్లు గడవడం కష్టంగా ఉంది. కాస్త నీ సహాయం కావాలి' అని తల్లి రాసిన ఉత్తరాలకు చెప్పుకోతగ్గ ఫలితం కనిపించలేదు. అందుకని అనంతం ఇంటర్మీడియట్‌తో చదువుకు స్వస్తిచెప్పి ఎన్నో ఉద్యోగాలకు అప్లికేషను పెట్టుకున్నాడు. ఫస్టు క్లాసులో పాసై మంచి భవిష్యత్తు అర్హత ఉన్న తన విద్యార్థి చదువు మానడం సూర్యనారాయణ గారికి బాధ కలిగించింది. కానీ, ఆయన చేయగలగినదేమీ లేదు. పార్వతమ్మ ఆరోగ్యం మునుపటిలాగా లేకపోయినా అనంతం మీద ఆశ పెట్టుకుని రోజులు సాగిస్తూంది. కామేశ్వరి జీవితంలోంచి అత్తగారు నిష్క్రమించాక చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి. ఆమె భర్త పెద్దగా చదువుకోకపోయినా, చేస్తున్న వ్యాపారం పుంజుకుని రాణింపుకు వచ్చింది.

ఇంటర్వ్యూకి రమ్మనమని రైల్వే పాసు వచ్చింది అనంతానికి. ఎదురింటి దంపతులు జగన్నాథం, నాగరత్నమ్మ గార్లతో కాస్త అమ్మని చూడమని బతిమాలి వెళ్ళాడు అనంతం. నాగరత్నమ్మ చెల్లెలు కూతురు శశి, పార్వతమ్మకు తెలియనిదికాదు. రెండు రోజులకొకమారైనా కరివేపాకు రెమ్మ కానీ, కొత్తిమిరి కట్టకాని తీసుకువచ్చి పార్వతమ్మకు ఇచ్చి బాగున్నారా అని అడిగివెళ్ళడం మామూలే. పార్వతమ్మకు ఎప్పుడైనా జలుబూ, జ్వరమూ వస్తే పొయ్యిమీది గిన్నె దించిపోయేది శశి. ఇంటర్వ్యూ అయి తిరుగుముఖం పట్టిన అనంతానికి రైల్లో నిద్రరాలేదు. పూలజల్లులా వెన్నెల కురుస్తూ ఉంటే కిటికీలోనుంచి చూస్తూ గత జీవితాన్ని నెమరేసుకుంటున్నాడు. తన తండ్రి ఎప్పుడూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జీవించలేదు. తల్లి ఈ కారణంగా చాలా ఇబ్బందులకు గురి అయింది. అందులో అక్క పెళ్ళి తరవాత మానసికంగా మరీ కుంగిపోయింది. ఎలాగైనా అమ్మని సుఖపెట్టాలి. ఇది అనంతం మనసులోని కోరిక. ఈ ఉద్యోగం తనకు రాగల అవకాశాలు ఉన్నాయనీ, తన తల్లి కష్టాలు గట్టెక్కుతాయనీ అనుకున్నాడు అనంతం.

ఉత్సాహంగా ఇంట్లో అడుగు పెట్టిన అనంతానికి చేతి కట్టుతో ఎదురయింది పార్వతమ్మ. అన్నం వారుస్తూ గంజి చేతిమీద పోసుకుంది. ఎదురింటి శశి వచ్చి కట్టుకట్టి వెళ్ళిపోతోంది. ఈ పరిస్థితిలో అమ్మని చూసి బాధ పడ్డాడు. ఒక నెల గడిచాక వాల్తేరు స్టేషనులో ఉద్యోగంలో చేరమని కాగితం రావడం, వెళ్ళి చేరడం జరిగింది. ఇంతవరకూ పట్టించుకోని పార్వతమ్మ బంధువులు కొందరు వచ్చి అనంతం పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. కామేశ్వరి కూడా తన పెనిమిటి వైపు బంధువులు ఉన్నారని, అనంతాన్ని అడుగుతున్నారని, కట్నం బాగా ఇచ్చి లాంఛనాలు జరిపి ఘనంగా పెళ్ళి చేస్తారని రాసింది. డ్యూటీలో చేరిన మూడు, నాలుగు నెలలకు రెండు రోజుల సెలవు మీద అనంతం ఇంటికి వచ్చి "అమ్మా మనం వాల్తేరు వెళ్ళిపోదాం. ఇక్కడ ఎందుకూ, ఈ అద్దె ఇంట్లో మనకు ఏముంది కనక?'' అన్నాడు పార్వతమ్మతో. ఇదే అదనుగా చూసి పార్వతమ్మ అనంతంతో పెళ్ళి ప్రస్తావన తెచ్చింది. వస్తున్న సంబంధాల గురించీ, కామేశ్వరి రాసిన సంబంధాల గురించీ వివరించి "కట్నకానుకలు ఇచ్చి ముద్దూ, ముచ్చటా తీరుస్తారట" అని ఆశగా చెప్పింది. తన తల్లి ఆరోగ్యం మునిపటిలాగ లేదనీ ఓపిక తగ్గిపోయిందనీ, పెళ్ళి ప్రస్తావన అప్రస్తుతం కాదనీ అర్థం చేసుకున్నాడు అనంతం.

"ఎదురింటి వాళ్ళ శశి నీతో ఎంతో కలుపుగోలుగా ఉంటుంది కదా! ఆమెకు ఇష్టమైతే నీ కోడలుగా చేసుకోరాదూ" అన్నాడు అనంతం. పార్వతమ్మ ఆశ్చర్యపడడమే కాదు, కాస్త ఇరుకున పడ్డట్టు ముఖం పెట్టి "పిల్ల మంచిదే. పని పాటా వచ్చు కానీ...." అంటూ ఆగింది. అమ్మ సందేహం ఏమిటో అర్థంకాక ఆమె వైపు చూశాడు అనంతం. "తల్లీ తండ్రీ లేని పిల్ల, పినతల్లిమీద భారంగా బతుకుతూంది. నీకు ముద్దూ ముచ్చటా ఏమి తీర్చగలరూ, కట్నం మాట సరే సరి" అంది పార్వతమ్మ. సరిగ్గా అదే సమయానికి, కరివేపాకు రెమ్మతో ఇంట్లో

అడుగు పెట్టబోతున్న శశి, తనకు సంబంధించిన సంభాషణ చెవులపడి చటుక్కున ఆగి, వెనక్కు వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ పార్వతమ్మ అభిప్రాయం కూడా తనతో తీసుకు వెళ్ళిపోయింది. "అక్క పెళ్ళికి వెనక పెట్టిన కట్నం బాకీ తీర్చలేక మనం నానా అవస్థలూ పడ్డాం. ఈ ఇచ్చిన కట్నాలు ఎన్ని రోజులు నిలుస్తాయి. నీ పిచ్చికానీ" అంటూ అనంతం లోపలికి వెళ్ళిపోయాడు అక్కడ నిలవకుండా. పెద్దకొడుకూ, కూతురూ ఏమంటారో అని కాస్త సందేహించినా, చిన్నకొడుకు మనసు బాగా ఎరిగిన పార్వతమ్మ ఎదురింటి జగన్నాథం గారిని శశి పెళ్ళి గురించి కదిపి చూసింది.

కట్నం ప్రసక్తి లేకుండా పార్వతమ్మ శశిని కోడలుగా చేసుకుంటుందంటే నాగరత్నమ్మ ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోయింది. అంతేకాదు లేని అనుమానం కూడా కలిగింది. "ఆమె కొడుక్కి ఏ లోపం లేదు కదా" అని జగన్నాథంతో అంటే అతను నవ్వి "ఏం మాటలే మరీను- చిన్నతనం నుండీ తెలిసిన పిల్లడు'' అంటూ మందలించాడు చిరాకుగా.

"పోనీ, అనుమానమైతే వద్దని పార్వతమ్మతో చెప్పి కట్నం పోసి వేరే సంబంధం తీసుకురా'' అని కూడా అన్నాడు వ్యంగ్యంగా.

పార్వతమ్మ పెద్దకొడుక్కి, కూతుకికి ఉత్తరాలు రాసింది- శశి విషయం. ఉత్తరాలకు జవాబులు రాసే అలవాటు పెద్దకొడుకుక్కి ఏనాడూ లేదు. కామేశ్వరి మాత్రం నిష్ఠురంగా రాసింది. ''నేను చక్కటి సంబంధం చూస్తే తమ్ముడికి అక్కరలేక పోయిందా. ఈ ముష్టి సంబంధం కావలసి వచ్చిందా?'' అని హేళనగా రాసింది. అది విన్న అనంతం ఆశ్చర్యపోయాడు. కట్నం విషయంలో ఎన్నో మాటలు పడ్డ అక్కకు కట్న కానుకల మీద ఇంత మోజేమిటో'' అనుకున్నాడు.

అనంతం పెళ్ళి శశితో నిరాడంబరంగా జరిగిపోయింది. అన్నకి సెలవు దొరకలేదని తప్పించుకున్నాడు. వదినె మాత్రం విశాఖలో తన అన్నగారి ఇంటికి వెళ్తూ మరిది పెళ్ళి చూడడానికి వచ్చి వెళ్ళింది. కామేశ్వరి తమ్ముడు పెళ్ళికి వచ్చిందేకానీ, రుసరుసలాడుతూ ఉంది. తనకు సరిఅయిన మర్యాదలు జరగలేదని అలిగి వెళ్ళింది. అనంతం సిటీకి కాస్త దూరంగా మర్రిపాలెంలో చిన్న వాటా తీసుకుని, శశితో తల్లితో విశాఖపట్నం తరలిపోయాడు. పార్వతమ్మ, శశి ఇద్దరూ పొందిక సంసారానికి అలవాటు పడ్డవాళ్ళే అనంతం తన జీతంతో సాఫీగానే సంసారభారం లాగుతున్నాడు. కానీ, ప్రశాంతమైన నీటిలో రాయి విసిరినట్టు అతని జీవితంలో ఒక అలజడి ప్రారంభం అయింది. బావగారి వ్యాపకం కాస్త రాణింపుకు రావడంతో విశాఖపట్నంలో ఒక ఆఫీసు పెట్టి, వాళ్ళ కాపురం నర్సీపట్నం నుండి విశాఖలోని డాబా గార్డెన్స్‌లోకి మార్చారు. అప్పటినుండీ కామేశ్వరి తరుచు మర్రిపాలెం రావడం, వచ్చినప్పుడు అమ్మనూ, మందలునూ తన ఇంటికి తీసుకు వెళ్ళడం, తమ్ముడి ఇంట్లో ఒకటి రెండు రోజులు ఉండడం చేసేది. ఇందులో అసహజమైనదేమీ లేకపోయినా కొన్ని సందర్భాలలో కామేశ్వరి ప్రవర్తన శశి మనసును తీవ్రంగా గాయపరచేది. శశిని తన స్నేహితురాళ్ళకూ, ఇరుగు పొరుగులకూ పరిచయం చేస్తూ "మా తమ్ముడి భార్య, కానీ కట్నం లేకుండా చేసుకున్నాం" అని ప్రత్యేకించి చెప్పేది. ఏదో ఒకమారైతే పోనీ అని సరిపెట్టుకున్నా, కనిపించిన ప్రతివారితో చీటికీ మాటికీ అలా చెప్పడం తనను ప్రత్యేకించి అవమానించడానికే అని క్రమంగా శశి తనమనసులో ఏవగించుకోవడం మొదలుపెట్టింది. పార్వతమ్మ సాధారణంగా శశితో అభిమానంతోనే వ్యవహరించేది. కాని, కామేశ్వరి వచ్చినప్పుడు తల్లితో ఏదో మెల్లగా మాటలాడడం, శశి దగ్గరకు వచ్చినప్పుడు స్వరం ఇంకాస్త తగ్గించి మాటలాడడం శశిని కించపరిచే విధంగా ఉండేది. అత్తగారికి కూడా

కట్నకానుకలమీద ఇష్టం ఉన్నట్లు ఒకానొక రోజు తన పెళ్ళికాక పూర్వం తెలుసుకున్న శశికి అప్పుడప్పుడు మనసులో కలుక్కుమని బాధ కలిగేది. "అత్తగారికికూడా తనంటే ప్రేమలేదేమో. కేవలం అనంతం ఒత్తిడిమీద రాజీపడ్డదేమో" అని మనసులో ఏదో అసంతృప్తి కలిగేది.

శశి తొలిసారి ఆడపిల్లనూ, తరవాత బాబునూ కన్నది. తొలి కానుపు సమయంలో "నువ్వేమీ బెంగపడకు. ఇక్కడ నా స్నేహితుని అక్క డాక్టరు. ఆమెకు మెటర్నిటీ హూమ్ ఉంది ఇరుగు పొరుగుల సహాయం ఉండనే ఉంటుంది. నేను సెలవు పెడతాను" అని అనంతం ధైర్యం చెప్పి శశిని విశాఖపట్నంలోనే ఉండమన్నాడు. సునాయాసం గానే ప్రసవించింది. ఇరవై ఒకటవ రోజున ఉయ్యాలలో వేశారు. వారం రోజుల ముందుగా తన అన్నగారి ఇంటికి వచ్చిన అనంతం వదినె ఆ రోజు ఒకమారు ఈ సందర్భంగా అత్తగారిని, మరిదిని చూడక వెళ్ళిపోతే బాగుండదేమో అని లాంఛన ప్రాయంగా వచ్చింది. వచ్చిన మనిషి ఊరికే పోక ఉయ్యాలలో ఉన్న పసికందును చూస్తూ వ్యంగ్యంగా కామేశ్వరితో ఛలోక్తి విసిరింది.

"ఆడపిల్ల అయితేనేం, వాళ్ళ అమ్మలాగే పైసా ఖర్చు లేకుండా ఎవరింటికో దొర్లిపోతుంది. మరేం బెంగలేదు" అన్న ఈ మాటలు పక్కగదిలో వున్న శశి చెవినిపడ్డాయి. "ఆమె ఒక్కతే డబ్బు పారేసి భర్తను కొనుక్కున్నానని గర్వం కాబోలు" అని విసుక్కుంది శశి తన మనసులో. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు పరిపాటైపోయాయి. అనంతం కూడా ఈ ధోరణి గమనించకపోలేదు.

ఒకనాడు కామేశ్వరి ఇంట పేరంటానికి వెళ్ళి వచ్చిన శశి ముభావంగా, గంభీరంగా ఉంది. ఏదో తలచుకొని కళ్ళు కొంగుతో తుడుచుకుంటున్న శశిని చూసి "ఏం అలా ఉన్నావు? ఒంట్లో బాగుండ

లేదా?" అన్నాడు అనంతం మెల్లగా. ఆ ప్రశ్న నిండుకుండను పగల గొట్టినట్లు చేసింది. శశి వెక్కి వెక్కి ఏడ్చింది. "కట్నం లేకుండా చేసుకున్నానని ఒక రాగిరేకు మీద రాయించి మూగ వాళ్ళకు వేసిన విధంగా నా మెడలో కట్టి పడేస్తే సరిపోయేదిగా. ఇలా దారిన పోయే వాళ్ళందరికీ చెప్పి ఆనందించకపోతే" అన్నది శశి బాధగా. పేరంటం పేరిట ఇంటికి తీసుకు వెళ్ళిన కామేశ్వరి తన భార్యను ఎలా మానసికంగా బాధించిందో ఊహించగలిగాడు అనంతం. ఏమనాలో, ఎలా సముదాయించాలో అర్థం కాలేదు. ఊరికే నిలవలేక "నేను ఎన్నడైనా అలా ఎవరితోనైనా అన్నానా?" అన్నాడు బేలగా.

"మీరు అనకపోతేనేం మీ అందరి వంతూ మీ అక్క అరుస్తూ వుంటే" అంది నిష్టురంగా. అంతటితో ఊరుకోలేదు శశి. "అత్తగారు కూడా ప్రతి నిముషం ముద్దూ ముచ్చటా తీరలేదని బాధపడి పోతున్నట్లు తోస్తుంది. మీ అక్క వచ్చినప్పుడు ఆ బాధను కెలికి పెట్టి పోతుంది. అంతకుముందు సౌమ్యంగా ఉన్న అత్తగారు కూడా అసంతృప్తిగా ముఖం మాడ్చుకుంటారు. ఇలాంటి కట్నం లేని పెళ్ళి నా పిల్లలకు ఛస్తే చెయ్యను" అంది రుద్ధ కంఠంతో.

అనంతం మనసులో ఆలోచనలు జోరీగల్లా రొద చేశాయి. ఈ ప్రపంచాన్ని తను సరిగ్గా అవగాహన చేసుకోలేక పోయినట్లనిపించింది. కేవలం కట్నం ఇచ్చుకోవలసిన సందర్భం మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో తన తల్లిగా, అక్కగా, వదినెగా, ఆఖరికి తను కోరుకున్న అర్థాంగిగా స్త్రీ తనకు తెలియకుండానే ఈ కట్నమిచ్చే సంప్రదాయాన్ని సమర్థించి, తరతరాలకు అందచేస్తోందా అని ప్రశ్న వేసుకున్నాడు. మనం నిర్మించుకున్న ఆర్థిక వ్యవస్థలో అవకాశం ఉన్నవాడు అవసరంలో ఉన్న వాడిని దోచుకోవడం ఏదో పేరుతో తప్పనిసరిగా జరుగుతున్నప్పుడు స్త్రీని ప్రత్యేకించి తప్పు

పట్టడం సమంజసం కాదేమో అని మరో సందేహం ఉదయించింది. ఏది ఏమైనా కట్నం ఒత్తిడి చేసి పుచ్చుకునే సంప్రదాయం నిషేధించ డానికి మహిళాలోకం మానసికంగా సిద్ధంగా ఉందా? అనుకున్నాడు అనంతం. ఆలోచిస్తూ అలా నిస్సహాయంగా ఉండిపోయాడు. తన వదినె డబ్బుతో అన్నను కొనుక్కో గలిగానని గర్వంగా భావిస్తూ ఉంటే తన భార్య ఏమీ కట్నం లేకుండా వచ్చినందుకు న్యూనత పడు తున్నది. అనంతం ఆలోచనలలోనుంచి తేరుకుని శశి కళ్ళు తుడుస్తూ "నిన్ను అగౌరవపరిచే గడప ఎంతటి వారిదైనా నేటినుంచీ తొక్కవలసిన అవసరం లేదు. కానీ మన పిల్లకి కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యాలని ప్రతిజ్ఞ చెయ్యకు. అదేం పరిష్కారం? మన పిల్లలను చక్కగా చదివించి, వ్యక్తిగతమైన విలువను పెంచి, కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకునేటట్టు తీర్చి దిద్దుతాననీ, మన బాబుకి కట్నం అన్న ప్రసక్తిలేకుండా కోడలిని స్వీకరిస్తాననీ ప్రతిజ్ఞ చెయ్యి అన్నాడు.

—ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7-5-86